తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బోనమందలో ఏనుగుల బీభత్సం

సోమల, ఆగస్టు 7, ప్రభాతవార్త



పేటూరు పంచాయితీ బోన మంద గ్రామంలో బుధవారం ఉదయం ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. ఉద యం 8 గంటల ప్రాంతంలో అడవిలో నుంచి గ్రామంలోకి చొరబడిన 15 ఏనుగుల గుంపును చూసి ప్రజలు భయ భ్రాంతుల య్యారు. కుక్కలు ఏనుగుల వెంట పడడం, గ్రామస్తులు డప్పులు కొడుతూ బాణాసంచా పేల్చడంతో వేరొక మార్గంలో అడవిలోకి ప్రవేశించాయి. తిరిగి ఎప్పుడు గ్రామంలో ప్రవేశిస్తాయోనని ప్రజలు భయ భ్రాంతులవుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లకుండా గ్రామాలకే పరిమితమయ్యారు. అటవీ సిబ్బంది చర్యలు తీసుకుని వాటిని దాటి మళ్లించి అడవిలోకి పంపే ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

## పురుశైవారితోటకు మలయప్ప

తిరుమల,ఆగస్టు 7(ప్రభాతవార్తప్రతినిధి:

తిరువాడిపురం సాత్తుమొరలో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవులతో కలసి మల యప్పస్వామి ఆలయానికి సమీపంలోని పురుశైవారి తోటకు వేంచేశారు. అక్కడ ఆలయ అర్చకులు మంగళవాయిద్యాల నడుమ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు.



# కుప్పంలో సెజ్ ఏర్పాటు




**సిఎం చంద్రబాబు ఆదేశాలు**
**- రెండువేల ఎకరాల భూసేకరణకు అధికారుల కసరత్తులు..**
**సెజ్ ఏర్పాటుతో యువతకు ఉపాధి !!**

కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెజ్ ఏర్పాటు కోసం ఆదేశాలు జారీ చేసారు. ఈ నేపథ్యంలో అధికారులు సుమారు రెండువేల ఎకరాల భూముల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సెజ్ ఏర్పాటుకు అవసరమైన భూముల కోసం పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికే కుప్పం ప్రాంతంలో సుమారు 189 ఎకరాల్లో ఉన్న పారిశ్రామిక వాడలో గార్మెంట్స్, స్టీల్, డెయిరీ పరిశ్రమలు కొన్ని ఏర్పాటయ్యాయి. ఇవి కాకుండా కుప్పంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారు.వచ్చే ఐదేళ్ల కాలంలో సాధ్యమైనన్ని పరిశ్రమలు కుప్పానికి తేవాలని సిఎం ఆలోచన. మరో పక్క సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి సైతం కుప్పానికి రెండు భారీ పరిశ్రమలు తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుకోసం అధికారులు భూములను సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులకు ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుచేయాలని ఆదేశాలు అందాయి. దీంతో కుప్పంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతాలు గుర్తించి సర్వేలు చేపట్టారు.

**పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం :**

కుప్పం నియోజకవర్గంలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉంది. చక్కటి రోడ్ కనెక్టివిటీ ఉండడంతో పాటు అవసరమైన భూములు, విద్యుత్ సౌకర్యాలు ఉన్నాయి. హంద్రీ- నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో వస్తే పరిశ్రమలకు నీటి కొరత సైతం ఉండదు. ఇటు కర్ణాటక రాజధాని బెంగళూరు నగరానికి కేవలం వంద కిలోమీటర్లు, అటు తమిళనాడు రాజధాని చెన్నై నగరానికి రెండువందల యాభై కిలోమీటర్ల దూరంలో మాత్రమే కుప్పం నియోజకవర్గం ఉంది. ఈ నేపథ్యంలో కుప్పం ప్రాంతం రెండు ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండడం పారిశ్రామికవేత్తలకు లాభదాయకంగా మారనుంది. ప్రధానంగా కుప్పం ప్రాంతం వాణిజ్య పంటలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ నుంచి పూలు, కూరగాయల ఎగుమతులు అధికంగా ఉన్నాయి. దీంతో కుప్పం ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుకు చక్కటి అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2014-19 మధ్య కాలంలో ప్రకటించిన రీతిలో పరిశ్రమలకు సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తే కుప్పంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇటీవలే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్వర్యంలో రామకుప్పంలో వ్యవసాయ ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈనెల 12వతేది నుంచి కుప్పం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుంచి కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున దరఖాస్తులు సీ ్వకరించనున్నారు. ఏది ఏమైనా సిఎం చంద్రబాబు నాయుడు చొరవతో కుప్పంలో రానున్న ఐదేళ్లలో మరిన్ని పరిశ్రమలు కుప్పంలో ఏర్పాటవుతాయని తద్వారా తమకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని యువత ఆశగా ఎదురుచూస్తున్నారు.

### చేనేత ఉత్పత్తుల

# మార్కెటింగ్ పెంపునకు చర్యలు

**- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

చేనేత కార్మికులు ఉత్పత్తి చేసే నాణ్యమైన ఉత్పత్తులపై వినియోగదారులకు అవగాహన పెంచి మార్కెటింగ్ పెంచడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన బుధవారం 10వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. చేనేత కార్మికులకు అవసరమైన యంత్రాలు, షెడ్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించడానికి జిల్లా అధికార యంత్రాంగం కృసి చేస్తున్నదన్నారు. చేనేత కార్మికుల్లో అత్యధికులు నిరుపేదలు వుంటారని, వీరికి ఆరోగ్య భద్రత, వృత్తి పరంగా ఎద్దైనా ప్రమాదాలు జరిగినపుడు ఆదుకొనేలా ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం వుందన్నారు. చేనేత ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలు, నగరాల్లో డిమాండ్ ఎక్కువగా వుందని, దీనిని దృష్టిలో వుంచుకుని చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా సచివాలయం, సబ్ రిజిస్ట్రార్, ప్రభుత్వ ఆసుపత్రులు, జడ్పీ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయాల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే చేనేత కార్మికులకు సంబంధించి బ్యాంకు రుణాలు, ఇన్సురెన్స్ తదితర అంశాలపై జరుగనున్న సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని 10 మంది నేతన్నలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖ డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, నేతన్నలు పండరీనాథ్, కుప్పయ్య, వాసు, కృష్ణయ్య, నీలకంఠం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## భాకరాపేట ఘాట్‌లో లారీ బోల్తా

### డ్రైవర్ మృతి



చంద్రగిరి, భాకరాపేట ఆగస్టు 7 ప్రభాతవార్త:

భాకరాపేట ఘాట్ రోడ్డులో బుధవారం లారీ బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్ చీమల నవీన్ (27) మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట ఘాట్ రోడ్డులో పీలేరు నుండి తిరుపతి వైపు లోడుతో వెళుతున్న లారీ 5వ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వరదయ్యపాళ్యం, కళత్తూరుకు చెందిన చీమల నవీన్ ప్రమాద ఘటనా స్థలిలోని మృతి చెందాడు. లారీలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి.

**బాధితులను ఆదుకున్న టాస్క్‌ఫోర్స్**

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 7, ప్రభాతవార్త

తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ లింగాధర్ టీం బుధవారం భాకరాపేట వైపు కూంబింగ్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ మలుపులో లారీ ప్రమాదానికి లోనై తిరగబడి ఉండటాన్ని గమనించారు. మనవతా దృక్పథంతో వెంటనే స్పందించిన టాస్క్‌ఫోర్స్ టీమ్ సహాయ కార్యక్రమాలు చేపట్టింది. అయితే గాయాలై, కదలలేని పరిస్థితిలో ఉన్న వారిని అంబులెన్స్ కోసం చూడకుండా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వీరు ఎర్రావారిపాలెం నుండి వడ్ల బస్తాలు వేసుకుని వస్తున్నట్లు తెలిసింది. కొందరు లారీ టాప్ పైన కూర్చుని ఉన్నట్లు స్థానికులు ద్వారా తెలిసింది. టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సరైన సమయానికి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన సిబ్బందిని డాక్టర్లు ప్రశంసించారు. వారిలో ఒకరు మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

# షార్‌లో సందడే సందడి

**అంతరిక్ష కేంద్రంలో ఘనంగా స్పేస్‌డే కార్యక్రమాలు**
**13న పవన్‌కళ్యాణ్‌కు రాకకు ఏర్పాట్లు-17న ఎస్ఎస్ఎల్‌వి-డి3 ప్రయోగ సన్నాహాలు**
**- శాస్త్రవేత్తలతో సెమినార్లు, ప్రైవేటు స్టార్టప్ వారిచే ప్రసంగాలు**
**- నేడు తిరుపతిలో ఘనంగా కార్యక్రమాలు - ముఖ్య అతిథిగా ఇస్రో ఛైర్మన్ సోమనాథ్**








శ్రీహరికోట (తడ), ఆగస్టు 7 ప్రభాతవార్త

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్పేస్ డే కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించారు. భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాల మీద శాస్త్రవేత్తలు ప్రసంగించారు. షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన వర్క్‌షాప్‌లో చంద్రయాన్-3 రూపకల్పనలో పనిచేసిన యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌కు చెందిన శ్రీమతి కె.కల్పన పాల్గొని ప్రసంగించారు. స్కైరూట్ ప్రతినిధి జివిఎస్ కిరణ్ మాట్లాడారు. ఈ స్టార్టప్ వారు షార్ నుంచి గతంలో రాకెట్‌ను రూపొందించి ప్రయోగించి ఉన్నారు. క్యాట్‌సూర్, రాకెటీర్స్ ప్రతినిధులు ప్రదీప్‌బసు, దివ్యాంసుకోడా, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీకి చెందిన డాక్టర్ రిషికేష్ వెంకటరామన్ పాల్గొన్నారు. షార్ శాస్త్రవేత్తలు ఎస్.శంభుప్రసాద్, ఎస్.రఘురామ్, పి.గోపీకృష్ణ, పలువురు సీనియర్ శాస్త్రవేత్తలు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు.

**నేడు మోహన్‌బాబు కాలేజిలో...**

సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ వారి సహకారంతో గాడంకిలోని నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ ల్యాబొరేటరి ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో నేషనల్ స్పేస్‌డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. అక్కడి ఇండోర్ స్టేడియంలో మధ్యాహ్నం జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ విచ్చేస్తున్నట్లు షార్ వర్గాలు వెల్లడించాయి. కళాశాల ఛైర్మన్ ఎం.మోహన్‌బాబు, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ విశిష్ట అతిథులుగా పాల్గొంటున్నారు. గాదంకి కేంద్రం డైరెక్టర్ డాక్టర్ అనిత్‌కుమార్ పాత్ర, మంచు విష్ణు, వినయ్ మహేశ్వరి, నాగరాజ్ రామారావుతో పాటు షార్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రఘురామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అంతరిక్ష విజయాలపై ప్రసంగించనున్నారు. ఈ సెలబ్రేషన్ తర్వాత ఈ నెల 13న శ్రీహరికోటలో ముగింపు ఉత్సవాలు జరగనున్నాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. ఆ రోజు ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీహరికోటకు చేరుకొని స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఎంఆర్ కురుప్పు ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరగనుంది.



అయ్యలనాడు చెరువును జెసిబితో చదును చేస్తున్న దృశ్యం

# వాకింగ్ ట్రాక్ : బోట్ క్లబ్

**అంచనాల తయారీలో అధికారులు**

శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని అయ్యల నాడు చెరువుకు మహర్దశ కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.దాంతో అధికారులు పరుగులు తీస్తున్నారు.శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, ఇంజనీర్ సింధూలతో చర్చించారు. అభివృద్ధికి సంబంధించి తన అభిప్రాయాలను వివరించారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న అయ్యల నాడు చెరువును అందాల కొలనుగా తీర్చిదిద్దుటకు నాడు తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రణాళిక తయారు చేసి పాక్షికంగా రూ.75లక్షలు నిధులు కూడా మంజూరు చేసినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.కానీ ఆ నిదులు చెరువులో నీరు తొలగించుటకే సరిపోతుందని నాడు నిధులు మున్సిపల్ కార్యాలయంలో వినియోగించుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని సుధీర్‌రెడ్డి అధికారులతో చర్చించారు.

**అయ్యలనాడు చెరువుకు మహార్ధశ:**

శ్రీకాళహస్తి పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న అయ్యల నాడు చెరువులో పార్టీ కార్యాలయంతో పాటు ఆర్‌అండ్‌బి కార్యాలయం, అతిథి గృహం, పలు పార్టీలకు సంబంధించిన కార్యాలయాలు, జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ వైద్యశాల, తుడా భవనాలు, సమీకృత వసతి గృహం, సబ్‌స్టేషన్‌లతో పాటు అన్నా క్యాంటిన్ ఉంది.ఈ ప్రాంతాన్ని 'సర్వాంగ సుందరంగా' తీర్చి దిద్దాలన్నది లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్‌కు అదేశించారు. అయితే గతంలో అయ్యల నాడు చెరువు అభివృద్ధి సమయంలో రమేష్‌బాబే కమిషనర్‌గా ఉన్నారు. ఆయన ఇంజనీరింగ్ అదికారులతో సమన్వయం చేసుకొని రూ.15లక్షలతో మొదట పార్టీ కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బి అతిథి గృహం వరకు చెట్టుపుట్టా తొలగించి ఓ రూపాన్ని తెచ్చారు. అలాగే ప్రస్తుతం కార్యాలయాలు ఉన్నంత వరకు వదలిపెట్టి మిగిలిన స్థలంలో పాదచా రులకు సౌకర్యంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుకు ఆదేశించారు.ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికల రూపకల్పనలో తలమునకలై ఉన్నారు.అలాగే రెండవ దశలో బోట్ క్లబ్‌ను ఏర్పాటు, ఇక్కడే అందమైన పార్కును ఏర్పాటుకు ఎంఎల్‌ఏ ఆదేశించారు.దాంతో ఎంత నిధులు కావాలనే అంశానికి సంబంధించి పరిశీలిస్తున్నారు.

**రూ.15లక్షలతో సుందరీకరణ:**

పట్టణ నడిబొడ్డులోని ఏరియా ఆసుపత్రి రోడ్డు గతంలో పందుల స్వైరవిహారంతోనూ, వ్యర్థాలతో దుర్గంధభరితంగా ఉండేది.సుధీర్‌రెడ్డి శాసనసభ్యుడుగా గెలిచిన వెంటనే ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ రమేష్‌బాబుకు వివరించారు. జనరల్ ఫండ్స్ రూ.15లక్షలతో ఈ ప్రాంతాలను సుందరీకరణ పనులు చేపట్టారు.ఇక్కడ వాకింగ్ ట్రాక్‌తోపాటు తిరిగే వారు సెద తీరటానికి బెంచిలు ఏర్పాటు చేస్తున్నారు. ఆహ్లాదాన్ని ఇచ్చే చెట్లను పెంచను న్నారు.ఇక్కడ భద్రత దృష్ట్యా సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ ప్రాంత రూపు రేఖలు మారనున్నాయి. రెండు నెలల ముందు ఈ ప్రాంతాలను చూసిన వారు ప్రస్తుతం చూసి ఇంత మార్పా? అని చర్చించుకుంటున్నారు.

### చేనేత రంగంలో కార్మికులు

# అధునాతన పద్ధతులు పాటించాలి

**కలెక్టర్ వెంకటేశ్వర్**




వెంకటగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త

చేనేత రంగంలో కార్మికులు అధునాతన పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వెంకటగిరిలోనే ఒక కళ్యాణ మండపంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కార్మికులతో సమావేశం నిర్వహించారు. నేడు ట్రెడిషనల్ రంగం వైరు అందరూ మక్కువ చెబుతున్నారని కార్మికులు కూడా అలాంటి దుస్తులు తయారు చేయాలని సూచించారు. గుంట మగ్గలను విడనాడి స్టాండ్ మగ్గలను ఉపయోగించుకోవాలని సూచించారు. టిడ్కో గృహాలలో చేనేత కార్మికుల కోసం మగ్గాలు పెట్టుకునేందుకు వసతి కల్పించాలని కోరారని ఈ సమస్యను పరిష్కరింస్తానని తెలిపారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇస్తున్న పట్టు సబ్సీడీని ఎత్తివేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో మగ్గాల గుంటలో నీరు చేరకుండా ఉండేందుకు డ్రైనేజీలు సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయించాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలంలో చేనేత కార్మికుల మగ్గాల గుంటలో నీరు చేరి పనులు లేకుండా పోతున్నట్లు తెలిపారు.





### ద్విచక్రవాహనాన్ని

# ఢీకొన్న విద్యుత్ బస్సు

**ఇద్దరు తమిళనాడు యాత్రికులు దుర్మరణం**

తిరుమల, ఆగస్ట్ 7ప్రభాతవార్తప్రతినిధి:

ద్విచక్రవాహనంపై తిరుమలకు వస్తున్న ఇద్దరు తమిళనాడు యాత్రికులను జిఎన్‌సి టోల్‌గేట్‌కు చేరుకోకముందే బుధవారం ఉదయం విద్యుత్ ఆర్టీసి బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో తమిళనాడు పళ్ళిపట్టు వెలిఅగరంకు చెందిన ఏఎస్ కార్తీక్(28),అతనితో బాటు వెనుకకూర్చున్న మరో యువతి(26)అక్కడికక్కడే క్రిందపడటంతో దుర్మరణం చెందారు. ఇద్దరు ప్రాణాలు బలిగొన్న ఆర్టీసి విద్యుత్ బస్సుడ్రైవర్‌పై తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# భారీవర్షంతో అన్నదాత కంట కన్నీరు

**- పంటపై ప్రవహిస్తున్న వరద నీరు**

తడ, ఆగస్టు 7 ప్రభాతవార్త

భారీ వర్షంతో తడ మండలంలోని రైతులు నిండా మునిగి పోయారు. మూడురోజుల క్రితం కురిసిన వర్షంతోనే పంట మునిగిపోగా, మళ్లీ మంగళవారం సాయంత్రం కురిసిన కుండ పోత వర్షానికి వరిపంటపై నీళ్ల ప్రవహిస్తున్నాయి. కేవలం గంటసేపు ఏకంగా 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మండలంలోని మాంబట్టు, వెండ్లూరుపాడు, పొన్నపాడు, గుర్రాల మిట్ట, గోనిగుంట, దండుబాడు, చినమాంబట్టు, ఎన్ఎం కండ్రిగ గ్రామాల్లో 300 ఎకరాలకు పైగా కోతకొచ్చిన వరిపంట పనికిరాకుండా పోయినట్లు రైతులు తెలిపారు. మం డల వ్యవసా యాధికారి ఎస్ఎన్ కాంచన కూడా ఈ గ్రామాల్లో రెండుసార్లు పర్యటించి పంట నష్టం జరిగినట్లు చెప్పారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, రైతులంతా ఈ-క్రాప్ చేయించుకుంటే నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. కేఎన్ఎం 1638, 1010 రకాల వరిపంట నాటుకున్న రైతులు మరోవారం కోతకొస్తుందని సంబర పడుతున్న సమయాన భారీ వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది.



## ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానంతో మంచినీరు సరఫరా

**– పాలసముద్రం మండలంలో వినూత్నంగా ప్రారంభించిన ఆర్‌డబ్ల్యుఎస్**



**పాలసముద్రం, ఆగస్టు 7 ప్రభాతవార్త:** గ్రామీణ తాగునీటి సరఫరా సంస్థ పాలసముద్రం మండలంలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టి గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటి సరఫరాకు బుధవారం శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల ద్వారా శుద్ధం చేసిన మంచినీటి సరఫరాకు ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానంను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హేమంత్‌కుమార్, ఇఒఆర్డీ రమేష్‌లు పాలసముద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన పరికరాలు పంపుల నుండి ట్యాంకులో నీరు పరిశుభ్రమై నేరుగా కొళాయిల ద్వారా ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానంలో సరఫరా అవుతుందన్నారు. పాత విధానంలో ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయాలంటే పంచాయతీ సిబ్బంది ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మెట్ల ద్వారా ట్యాంకు పైకి ఎక్కి శుభ్రం చేసి క్లోరిన్ మాత్రలు కలిపే వారన్నారు. ఈ విధానం ప్రమాదకరంతో పాటు శ్రమతో కూడిన పని అన్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో ట్యాంకులు క్లోరినేషన్ నిర్వహణ జరిగేది కాదన్నారు. ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానంలో ట్యాంకుకు సంబంధించిన బోరు గొట్టానికి డివైజ్ పైపును అనుసంధానం చేసి క్లోరిన్ మాత్రను అమర్చి ట్యాంకుల పైకి ఆ నీరు వెళ్ళి క్లోరినేషన్ అయ్యేలా యూనిట్ ఏర్పాటు చేస్తారన్నారు. ఫలితంగా గ్రామంలోని ప్రతి కొళాయికి క్లోరినేషన్ అయిన పరిశుభ్రమైన నీరు సరఫరా అవుతుందన్నారు. మంచినీటి క్లోరినేషన్ కావడంతో నీటిలో వున్న బ్యాక్టీరియా నశించి నీరు పరిశుభ్రం అవుతుందన్నారు. ట్యాంకు వద్ద అమర్చిన గొట్టంకు 200 గ్రాముల పరిమాణం వున్న క్లోరిన్ మాత్రను అమర్చితే లక్ష లీటర్ల నీరు పరిశుభ్రం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధరణి, సర్పంచ్ అయ్యప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు :సిఐ

**వెదురుకుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త :**

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ సత్యబాబు విద్యర్థులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పోలీసులు, కళాశాల ఐక్యూఏసీ విభాగం యాంటి ర్యాగింగ్ విభాగం కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అనాగరిక చర్య అని అలాంటి వాటిని ప్రోత్సహించడం, పాల్పడం చట్టరీత్యా నేరమని విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద, యాంటీ ర్యాగింగ్ విభాగం సమన్వయకర్త సతీష్ కుమార్, అధ్యాపకులు శంకర్ రెడ్డి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలి



**– ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి పరమసముద్రంలో క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నేడు యువత అధికంగా సెల్‌ఫోన్లతో కాలం గడుపుతున్నారని అలా కాకుండా ప్రతి ఇక్కరూ క్రీడా మైదానాల్లో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు సైతం లభిస్తాయన్నారు. కుప్పంలో యువత కోసం ఎన్టీఆర్ స్టేడియాన్ని ఆధునీకరించి అతిత్వరలోనే అందుబాటులో తీసుకువస్తామన్నారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు రవి, మురుగేష్, ప్రతాప్ సింహా, రాజేంద్ర, బాలాజీ, వాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

**కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త**




ఇంజనీరింగ్ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని విజయవాడ ఐసిటి అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో బిటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు విద్యార్థులు లక్ష్యాలకు భయపడి చేయాల్సిన పనిని కూడా చేయరని పేర్కొన్నారు. లక్ష్యం గురించి ఆలోచించి ముందుకుసాగాలన్నారు. అవరోధాలకు కుంగిపోరాదని సూచించారు. కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ తమ కళాశాలలో వర్సిటీస్థాయిలోఅన్ని వసతులు ఉన్నాయన్నారు. ఈ బ్యాచ్‌తోనే అటానమస్ హోదాలో కోర్సులను ప్రారంభిస్తున్నట్లుతెలిపారు. హోసూరు టివిఎస్ సంస్థ హెడ్ హెచ్ఆర్ జాస్మిన్ మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగిన వారు మాత్రమే కార్పోరేట్ ప్రపంచంలో నిలదొక్కుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు,వైస్‌ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఒడి మాధవన్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నా రు.

## నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

**చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:** చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నిర్వహించనున్నారు. ప్రజలు సమస్యలపై ఎమ్మెల్యేకు 98499 07885 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చును. ఈ కార్యక్రమానికి చిత్తూరు మున్సిపల్ కార్యాలయ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు హాజరు కావాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. అలాగే ఇప్పటి వరకు నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి సంబంధించి నివేదికను అధికారులు సమర్పించాలన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



**చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:** నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తన నియోజకవర్గ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించడానికిచర్యలుతీసుకుంటామనికలెక్టర్ సుమిత్‌కుమార్ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు హామీ ఇచ్చారు.

## వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా జయరామయ్య బాధ్యతల స్వీకరణ

**చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:**



చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా బుధవారం జయరామయ్య వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల బదిలీల్లో భాగంగా పలమనేరు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జయరామయ్య చిత్తూరు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా జయరామయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా ఎస్పీ మణికంఠ చందోలును ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కలిశారు.



## శిశువుకు తల్లిపాలతో ఆరోగ్యం

**పాలసముద్రం, ఆగస్టు 7 ప్రభాతవార్త:**

శిశువులకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా పిల్లల ఎదుగుదలతో పాటు మేథా శక్తి, ఆరోగ్యం పెంపొందుతుందని రూరల్ యాక్షన్ సంస్థ విద్యావారధి రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాల గ్రామంలోని కమ్యూనిటీ హాలులో బుధవారం తల్లిపాల వారోత్సవాలను జిల్లా వినియోగదారుల ఫెడరేషన్ కౌన్సిల్ సౌజన్యంతో రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ విద్యావారధి రాజకుమారి తల్లి పాల వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేసి తల్లి పాల విశిష్టతను తల్లులు, బాలింతలు, మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో మానసిక ఎదుగుదల, మంచి తెలివితేటలు, ఆరోగ్యపరంగా ఎలాంటి రోగాలు లేకుండా చేయడం ఒక్క తల్లిపాలతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలతో తల్లిఫాల వారోత్షవాల ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రొగ్రాం అనలిస్టు షాలిని, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## భూమిని కాజేయడానికి ప్రయత్నం

**చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:**




తాతల కాలం నుండి తమ కుటుంబసభ్యుల ఆధీనంలో వున్న భూమిని కాజేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అధికారులు తమకు న్యాయం చేయాలని ఎస్ఆర్ పురం మండలం జిఎం ఆర్ పురం పురం పంచాయతీ వడ్డిపల్లి గ్రామంకు చెందిన కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ తమ తాతల కాలం నుండి తాము అనుభవిస్తున్న సెటిల్‌మెంట్ భూమిని అక్రమంగా కాజేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని వారి నుండి పోలీసులు తనకు రక్షణ కల్పించాలని కోరారు. తమ గ్రామంలో తమ తాతల కాలం నుండి తమ కుటుంబానికి 6.72 ఎకరాల భూమి వుందని, ప్రస్తుతం ఈ భూమిని కాజేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై వారు తమపై దాడులు చేస్తున్నారని, ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ తన కుటుంబంపై వారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయంపై స్థానికంగా పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అలాగే తనకు ప్రాణ హాని వుందని తనకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆయన అభ్యర్థించారు.

## ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ ఉత్సవ ఊరేగింపు.. అన్నదానం

**కుప్పంరూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త** కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం మధ్యాహ్నం ఆలయ కమిటీచే పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని అన్నదాన ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవాన్ని పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ హర్ష ధర్మతేజ, కమిటీ సభ్యులు,స్థానిక నేతలు పలువురు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్దుని దర్శించుకున్న ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

**చిత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు బుధవారం కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామిని జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంతో కలసి దర్శించుకొన్నారు. ఆలయ అధికారులు వేదమండపంలో వేదపండితుల చేత ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసారు. అంతకుముందు చిత్తూరులోని జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘ కార్యాలయానికి వెళ్లి జిల్లా డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వంతొ పాటు సంఘ నాయకులు రోషన్‌భాష, రామన్న, నాగరాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలను ప్రోత్సహిద్దాం

**– భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు**

**చిత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త:**

చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని, ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దామని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం భాజపా నాయకులు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని టిటిడి కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర దుకాణాలను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేసి వారికి శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ రాజ్యసభ సభ్యురాలు దుర్గారామక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, మండల అధ్యక్షులు షణ్ముగం, రామభద్ర, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, వేణుగోపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన లక్ష్మణ(పతి)రాజు



**–కార్యకర్తలను ఆదుకొంటామని భరోసా**

**చౌడేపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తేదేపా సీనియర్ నాయకుడు మండలానికి చెందిన మాదిరాజు లక్ష్మణ(పతి)రాజు కలిశారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో ఆయనతోపాటు పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలను తెలిపానని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గ తేదేపా నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులు వస్తున్నట్లు మాదిరాజు వివరించారు.

## స్మశానవాటికకు స్థలాన్ని చూపండి

**–నాయనివారిపాళెం వాసుల వేడుకోలు**

**చౌడేపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త**

స్మశానవాటికకు స్థలం చూపాలని తహశీల్దార్ హనుంతునాయక్‌ను నాయనివారిపాళెం వాసులు కోరారు. పాళెంలో 60దళిత కుటుంబాలున్నాయని, అయితే స్మశానవాటిక లేక చెరువులను ఆశ్రయించాల్సి వస్తోందని తహశీల్దార్‌తో మొరపెట్టుకొన్నారు. వర్షాకాలం వస్తే ఇబ్బందిగా వుందని, పలుమార్లు రెవిన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందించారు. పరిశీలించి స్థలం చూపిస్తామని తహశీల్దార్ వారికి హామీ ఇచ్చారు. రెడ్డిప్రసాద్, సుబ్రమణ్యం, నాయనివారిపాళెం ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నగొట్టిగల్లు తహశీల్దార్‌గా జనార్ధన్‌రాజు



**భాకరాపేట, ఆగస్టు 7 ప్రభాతవార్త**

చిన్నగొట్టిగళ్ళు మండల తహశీల్దార్‌గా కె.జనార్దన్‌రాజు నియమితులయ్యారు. బుధవారం ఈమేరకు ఆయన స్థానిక కార్యాలయంలో పదవీ బాధత్యలు చేపట్టారు. సాధరణ బదిలీలో భాగంగా శ్రీకాళహస్తి నుంచి ఇక్కడికి నియమితులయ్యారు. రెవిన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాననీ, ప్రజలు నేరుగా తనతో సంప్రదించాలని ఆయన కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## షార్ క్విజ్ పోటీ విజేతలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్ధినులే

**శ్రీహరికోట (తడ), ఆగస్టు 7 ప్రభాతవార్త**




నేషనల్ స్పేస్ డే సందర్భంగా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన క్విజ్ పోటీల్లో సూళ్లూరుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి స్థానం సాధించారు. మొత్తం 18 పాఠశాలల నుంచి ఈ పోటీలకు నలుగురు చొప్పున విద్యార్థినులు హాజరు కాగా, వారిలో స్పేస్ సెంట్రల్ స్కూలు, పలు కార్పొరేట్ స్కూళ్లను దాటుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు గెలుపొందడం విశేషం. వీరికి షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విజేతలకు ఈ నెల 13న శ్రీహరికోటలో జరుగుతున్న నేషనల్ స్పేస్ డే కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహుమతులు అందజేయనున్నారు. ఇదిలావుంటే ఆరు రౌండ్లలో జరిగిన పోటీల్లో మొదటి స్థానాన్ని సూళ్లూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ఎస్.హిమహన్షిణి, కె.సురంజన, ఎల్.యశస్విని, ఓ.అమృతలక్ష్మి గెలుచుకున్నారు. ద్వితీయ స్థానాన్ని శ్రీహరికోటలోని స్పేస్ సెంట్రల్ స్కూలు, తృతీయ స్థానాన్ని సూళ్లూరుపేటలోని సత్యం ప్రైవేట్ స్కూల్ వారు గెలుపొందినట్లు తెలిసింది.

## బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ జయజయరావు

**కోట, ఆగస్టు 7 ప్రభాతవార్త**



కోట మండల తహసీల్దార్‌గా కె.జయజయరావు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జయజయరావు గతంలో తడ మండల తహిశీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కోట మండలంను బదిలీ అయ్యారు. ఆయనకు డిప్యూట్ తహిశీల్దార్ మల్లికార్జున్‌రావు పుష్పగుచ్చం అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు.

## వెంకటగిరి తహశీల్దార్‌కి శుభాకాంక్షలు



**ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు**

**వెంకటగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**

తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మునిలక్ష్మిని ఏపి ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెతో పలు విషయాలను మాట్లాడారు. ఈ మాల మహానాడు నాయకుడు నన్నం మునెయ్య పాల్గొన్నారు.

## సొసైటీ సిఈవో శ్రీధర్ రెడ్డి మృతికి పలువురు సంతాపం

**బాలాయపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త**



జయంపు సొసైటీ సిఈవో అలిమిలి శ్రీధర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపిన కేంద్ర సహకార బ్యాంకు సిబ్బంది, సంఘ సిబ్బంది, సిఈవో శ్రీధర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరం అని సొసైటీ మాజీ అధ్యక్షులు వెన్నోటి కార్తీక్ రెడ్డి ఆందోళన చెందారు. విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారని తెలిపారు. సిఈఓ శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ఉచిత కంటి వైద్యశిబిరం

**చిల్లకూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త**




చిల్లకూరు గ్రామంలోని లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్‌లో గూడూరు పట్టణంలోని మైధిలి హాస్పిటల్ ఎదురుగా ఐసిఎస్ రోడ్డు నందు ఏర్పాటు అయి ఉన్నా ప్రవీణ ఐకేర్ ఆసుపత్రి వైద్యులు సత్య శ్రీ లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్‌లో సుమారు 200 మందికి కంటి వైద్య పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు రోజు బుధవారం కూడా వైద్య పరీక్షలు నిర్వహించి కంటి చూపు మందగించిన వారికి అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రొఫెసర్ సుకుమార్ సిబ్బంది, నాయనతత్తర్లు పాల్గొన్నారు.

## కాలనీల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు

**చిల్లకూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



గూడూరు మున్సిపల్ సంబంధిత గ్రామమైన చిల్లకూరులోని అన్ని కాలనీల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు చిల్లకూరులోని అన్ని కాలనీల్లో తిరిగి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని టిడిపి నాయకులు, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ అధ్యక్షులు తానంకి నానాజీ అధికారులను ఆదేశించారు. కాలనీలో నెలకొని ఉన్న త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ప్రధానమైన సమస్యలపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు తానంకి నానాజీ మాట్లాడుతూ అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని నమ్మి ప్రజలు తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో, ఊహించని విధంగా గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టాభి రామిరెడ్డి, రామచంద్రారెడ్డి, దాసరి రాము, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

**గూడూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**




తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ మైథిలిలు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో మైథిలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ జరిగింది. తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నఉండి గడియారం స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, మైథిలి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, మైథిలి ఆసుపత్రి వైద్యులు డాకర్ మైథిలి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లిపాలు పడితే ఎంతో ఆరోగ్యకరమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటున్నామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు గౌరీ, సిస్టర్లు పాల్గొన్నారు.

## ఘనంగా జిందాల్ వ్యవస్థాపక చైర్మన్ ఓం ప్రకాష్ జిందాల్ జయంతి

**చిల్లకూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**



చిల్లకూరు మండల పరిధిలోని లింగవరం గ్రామ పంచాయితీలో ఏర్పాటైన జిందాల్ పవర్ ప్లాంట్ యాజమాన్యం బుధవారం జిందాల్ వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ ఓం ప్రకాష్ జిందాల్ జయంతి నిర్వహించారు. లింగవరం గ్రామ పంచాయితీ పరిధిలోని కంటి చూపు మందగించి చూడలేని స్థితిలో ఉన్నటువంటి వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చారు. కళ్లద్దాలు, ఓపి జిందాల్ కంటి శిబిరం ద్వారా 64 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ పవర్ లిమిటెడ్ ఉద్యోగుల శ్రీకాంత, జోబిన్ మాథ్యూ, సిఎస్ఆర్ బృందం పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

**గూడూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త**



అంతరించిపోతున్న చేనేత కళను ఆదుకునేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చేనేత కార్మికులు అండగా ఉంటుందని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తీగల చంద్రశేఖర్ రావు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో చెన్నూరులోని చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకొని వారిని శాలువాలతో సత్కరించి చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు చేనేత సొసైటీ ప్రెసిడెంట్ కటికాల శ్రీనివాసులు, నేతన్నలు జిలగా బాలాజీ, మురళీ శ్రీనివాసులు, వెంకటేష్, జనసేన పార్టీ నాయకులు దామవరపు సుబ్రమణ్యం, రౌతు శివకుమార్, గోను క్రాంతి కుమార్, కుందర్తి నాగార్జున, చెన్నుమాటి అక్బర్ కుమార్, భాస్కర్, మనోజ్ కుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## 11న నెల్లిమంద పాలేటి గంగమ్మ జాతర

సోమల, ఆగస్టు 7, ప్రభాతవార్త : నెల్లిమంద సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మ జాతర ఈ నెల 11 ఆదివారం, సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సాకిబండ నరసింహులు తెలిపారు. మంగళవారం రాత్రి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ఆలయం నుంచి వేల్పులకు తీసుకువచ్చి జాతరకు శ్రీకారం చుట్టారు. ఎగువపల్లి దిగువపల్లి గ్రామాల్లో అమ్మవారిని ఊరేగించి బుధవారం రాత్రికి సోమలకు తీసుకువచ్చి భక్తుల దర్శనార్థం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తామని ఆయన తెలిపారు.

## తల్లంపాడులో తల్లిపాల వారోత్సవాలు ...

**దొరవారిసత్రం ఆగస్టు 7 ప్రభాతవార్త:**

మండలంలోని తల్లంపాడు అంగన్‌వాడి కేంద్రంలో సిడిపిఓ శారధాంబా ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ శారదాంబ మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని సూచించారు. ముర్రిపాలు బిడ్డకు తాగించడం వల్లన పిల్లలలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు.తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట సూపర్‌వైజర్ జనార్దన్, వరలక్ష్మి, హేమలత,అంగన్‌వాడి టీచర్లు మంగమ్మ, జయలక్ష్మి, సునీత, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

**సిడిపిఓ శంషాద్ బేగం**



**వెంకటగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**

తల్లిపాలే చిన్నారులకు శ్రేయస్కరమని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నందు తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ, డాక్టర్ రాజేష్ తల్లులుకు టీచర్స్‌కి తల్లిపాలు గురించి ప్రాముఖ్యత సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు అమృతం లాంటిదని దేవుడి ఇచ్చిన వరం కాబట్టి తల్లులు అందరు తల్లిపాలు బిడ్డలకు ఇవ్వాలని సూచించారు. ఆరు నెలలు వరకు తల్లిపాలు ఇవ్వాలని చెప్పారు. తల్లిపాలలో రోగ నివారణ శక్తి ఉందని తెలిపారు. ఇంకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ పరిమళ, మహిత, పోలమ్మ, కల్పలత, టీపీఎస్ సమస్త నిర్వాహకులు అలేఖ్య, టీచర్స్ పాల్గొన్నారు.

## వర్షానికి డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్

**వెంకటగిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త**




వెంకటగిరి తారకరామా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముసిగింది. అనంతపురం చిత్తూరు జట్ల మధ్య పోటీలు జరిగాయి. రాజ్ కుమార్ 124, గిరినాథ్ రెడ్డి 95, మహేందర్ 81 పరుగులు తీశారు. అనంతపుర్ మూడు పాయింట్లు చిత్తూరు ఒక పాయింట్ ఇచ్చి మ్యాచ్‌ని డ్రాగా ముగించారు. వర్షం కారణంగా క్రికెట్ మ్యాచ్‌కి అంతరాయం కలిగింది.

## శ్రీధర్ రెడ్డి మృతి తీరని లోటు



**చిల్లకూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

మండల పరిధిలోని కడివేడు గ్రామానికి చెందిన అలి మిలి శ్రీధర్ రెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోట ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధ వారం శ్రీధర్ రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా గూడూరు పట్ట ణంలోని అశోక్ నగర్ చెందిన ఆరు ముళ్ళ అమరమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆమె మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐదు వేల రూపాయిలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రా మికవేత్త తానంకి నానాజీ, మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, విరటపల్లి జానకిరామ్ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ఎదనపత్తి శ్రీనివాసులు రెడ్డి, పచ్చ వెంకటేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.



## వాకాడు తహశీల్దార్‌గా రామయ్య

**వాకాడు, ఆగస్టు 7, ప్రభాతవార్త**

వాకాడు తహశీల్దార్‌గా రామయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగా బాధ్యత చేపట్టిన తహశీల్దార్ రామయ్యకు డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్, వీర్ఓలు, విఆర్ఏలు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ బదిలీ పై సూళ్లూరుపేటకు వెళ్లారు.

## బడిలో మోగిన నగారా

**కోట,ఆగస్టు 7 ప్రభాతవార్త**

కోట మండలంలోని 77 పాఠశాలలకు నేడు గురువారం ఎన్నికల జరుగుతున్నాయని మండల విద్యా శాఖాధికారి దారా మస్తానయ్య తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడారు. ఆ మేరకు ఎన్నికల విధివిధానాలపై ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమాచారం అందించామన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికైన సభ్యులు చైర్మెన్, వైస్ చైర్మెన్‌ను ఎన్నుకుంటారని, ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. కమిటిలో మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అదేరోజుమధ్యాహ్నం3గంటలకుయాజమాన్యకమిటితొలి సమావేశం జరుగుతుందన్నారు.

# తొట్టంబేడు మండలంలో 'చైనా' పరిశ్రమల ఏర్పాటుకు పరిశీలన

తొట్టంబేడు,ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐదేళ్ళుగా స్థబ్దతగా ఉన్న కారిడార్‌లలో మళ్ళీ పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు.ఈ నేపధ్యంలో బుధవారం చైనాకు సంబంధించిన పారిశ్రామిక వేత్తలు స్థల పరిశీలనలు జరిపారు. తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల వద్ద ప్రభుత్వం పరిశ్రమలకు ఆరువేల ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ పరిశ్రమలకు అనుకూలంగా ఉందని గుర్తించారు. ప్రస్తుతం కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెన్నై-విశాఖ పట్టణం కారిడాల్లో చిత్తూరుజిల్లాకు అత్యధిక ప్రాధాన్యత లబించింది. అంతేకాక శ్రీకాళహస్తి నియోజవర్గంలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలంలో పారిశ్రామిక వాడలను ఎంపిక చేసారు. ప్రభుత్వ భూములను సేకరించారు. కేటాయించారు. ఈ నేపధ్యంలో తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం సరిహద్దుల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారు.ఈ నేపధ్యంలో చైనా సంస్థలు బుధవారం వచ్చి స్థలం పరిశీలించారు. అయితే చైనాకు చెందిన వారు ఇక్కడకు ఎందుకు వచ్చారో, ఏపరిశ్రమ ఏర్పాటు చేసేందుకు వచ్చారో మాత్రం ఎపిఐఐసి అధికారులు చెప్పకపోవడంలో ఆంతర్యమేమిటో. కనీసం పోన్‌లు చేస్తే కూడా తీయడానికి సమయం ఉండదు. చైనా బృందంతో ఎపిఐఐసి అసిస్టెంట్ మేనేజర్ రంజిత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.


రౌతుసూరమాలలో చైనా సంస్థల ప్రతినిధులు పరిశీలన

**కొత్త పారిశ్రామిక విధానంతో చేయూత:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం రౌతు సూరమాల వద్ద గతంలో పరిపాలించిన తెలుగుదేశం హయాం లోనే 6వేల ఎకరాల స్థలం సేకరించారు. అప్పటిలోనే నారా చంద్రబాబునాయుడు గ్రీన్ ప్యానల్ సంస్థను ప్రారంభించారు. ఈపరిశ్రమలో ప్రత్యక్ష్యంగా 450మంది, పరోక్షంగా 300మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. అప్పటిలోనే అక్సోరా పరిశ్రమ మరొకటి వచ్చింది.ఇక్కడ వేలాది మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్నారు. గ్రీన్ ప్యానల్ రెండవ యూనిట్‌ను కూడా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు భారీ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటుకు ముందుకు వచ్చాయి.కొత్త పాలసీతోనూ, రహదారులు, మార్కెటింగ్, కార్మికుల పరంగా సమస్యల్లేని ప్రాంతంగా ఈ సెజ్ ఉంది. ఇటు శ్రీకాళహస్తి,అటు శ్రీసిటి దగ్గర్లో ఉండటంతో ఈ ప్రాంతాలు పారిశ్రామల స్థాపనకు అనుకూలంగా ఉన్నాయి.అయితే చైనా బృందం ఏ పరిశ్రమ ఏర్పాటు చేస్తుందనేది ఎపిఐఐసి తేల్చాల్సి ఉంది.

## గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతాం

**గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్**



గూడూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త : గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనుల వివరాలను అధికారులు వెంటనే తెలియజేయాలని త్వరలో పనులు ప్రారంభిస్తామని పలు సమస్యల పై వచ్చే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో గూడూరు నియోజకవర్గంలోని పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రతి మండలానికి రెండు కోట్ల రూపాయిల నిధులు మంజూరు అయ్యాయని, వీటితో అత్యవసర పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, సర్వోత్తమ్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, కిషోర్ నాయుడు, నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, మట్టం శ్రావణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి ఆలయంలో...వాస్తు శాంతి, అంకురార్పణ



పుత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, వాస్తు శాంతి, అంకురార్పణ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ఉదయం ఆలయంలో స్వామివారికి పాలాభిషేకం కార్యక్రమం అనంతరం పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి మంగళవాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలంకరణతో వినాయకస్వామిని మూషిక వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఉభయ దారులుగా దేవస్థానం(కోవిల్‌కార్ల ద్వారా), పుత్తూరు, పరిసర ప్రాంతాల వన్నె(అగ్ని), కుల క్షత్రియ(వన్నిరెడ్డి), సమన్వయ సంక్షేమ సేవా సంఘం పుత్తూరు ఎద్దల చెరువు దొడ్డిరెడ్డి(అమాస రెడ్డి), మునెమ్మ కుమారుడు, వై.ముద్దుకృష్ణారెడ్డి, అమ్ము, మిట్ట పల్లూరు గ్రామం, ఉభయ దారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు మానుకోవాలి

**-సిఐటియు ఏ.డి.ఆర్.కార్యాలయం వద్ద ఆందోళన**



తిరుపతిరూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు మానుకోవాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సి.ఐ.టియు నాయకులు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఏ.డి.ఆర్. కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, కార్యధర్శి జయచంద్ర మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళా కార్మికులపై వేధింపులు అధికమయ్యాని, పని చేస్తున్న కార్మికులకు మధ్య వ్యత్యాసాలు చూపిస్తూ కార్మికులను తీర్చే ప్రయత్నాన్ని యాజమాన్యం చేస్తుందన్నారు. అదేవిధంగా సీనియార్టీ లేకుండా ఎవరికిపడితేవారికి పని ఇవ్వడం జరుగుతున్నదని, ఇదేమని ప్రశ్నిస్తే దుషణలతో పాల్పడుతున్నారని ఆరోపించారు. గత నాలుగు నెలలు నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, కార్మికులు ఆకలితో అలమటిస్తున్న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రోజు వేతనం కేవలం రూ.345 రుపాయాలు మాత్రమేనని, దాదాపు 175 మంది వర్కర్లు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.అనంతరం ఏడిఆర్‌కు వినతిపత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల యానియన్ అధ్యక్షులు పి.వరలక్ష్మీ, మునిలక్ష్మీ, చంద్రమ్మ, అనురాధ, శుభ రత్నమ్మ, సుబ్బునాగరాజు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కుంభాభిషేక మహోత్సవంలో మాజీ ఎంఎల్‌ఏ



చంద్రగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త: మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి కుంభాభిషే మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాగా వారితో కలసి ఉత్సాహంగా ఆలయానికి చేరుకున్న ఆయన ఆలయ పునఃనిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి పూనుకున్న చెవిరెడ్డి ముందుగా ఆలయ చైర్మన్‌గా యారాశి చంద్రశేఖర్ రెడ్డిని నియమించుకున్నారు. యారాశి అనారోగ్యంతో భాధపడుతూనే అమ్మవారి ఆలయ పున ఃనిర్మాణ పనులకు దాతల నుండి రూ.1.33 కోట్లు సేకరించారు. దీంతో అప్పటి ఎంఎల్‌ఏగా వున్న చెవిరెడ్డి టిటిడి నుండి రూ.4 కోట్లు, దేవాదాయ శాఖ నుండి రూ.1 కోటి విడుదల చేయించుకున్నారు. అప్పటి తుడా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ద్వారా నుండి రూ.1.65 కోట్లు మంజూరు చేయించుకున్నారు. తుడా నిధులతో ఆలయం వద్ద అన్నదాన సత్రం, బాలాలయ మండపం, రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించారు. అమ్మవారి కుంభాభిషేక మహోత్సవానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో విశిష్ట స్థానం కలిగిన వారికి పౌరసన్మానం చేయనున్నట్లు చెవిరెడ్డి తెలిపారు.

## శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ యంత్రశిఖర ప్రతిష్ట

**ప్రత్యేక పూజలో ఎంఎల్‌ఏ పులివర్తి దంపతులు**



చంద్రగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో బుధవారం అమ్మవారి పున్న నూతన ఆలయ యంద్రశిఖర ప్రతిష్ట సహిత శతచండీ సహిత కలశ కుంభాభిషేక పూజాధి కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కుంభాషేక మహోత్సవ ప్రత్యేక పూజలో ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవ వేడుకలకు ఎంఎల్‌ఏ దంపతులు సంప్రదాయ వస్త్రధారనలతో హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. మొదటి రోజున వేదపండితులు ఉదయం 9 గంటలకు స్వస్తితో, యాగశాల ప్రదక్షిణము, భూతబలిహరణ, యాగశాల ప్రవేశము, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యమండపారాధన, మార్జనలు, శతచండీ పారాయణ, అఖండ ధీపారాధన, అస్త్రదేవతారాధన శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, చతుషష్టే చండీమండపారాధన, ఆవరణ హోమ, మూలమంత్ర హోమములు, చండీ హోమం, భేరీతాడవాది సమస్త చూర్ణికలు, నీరాజన మంత్రపుష్పము, చతుర్వేద, దర్బారు సేవ ఆశీర్వచనములు, ప్రసాద వినియోగం గావించారు.

## ఘనంగా మహిళా వర్సిటీలో జాతీయ చేనేత దినోత్సవం

తిరుపతి విద్య, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. భారతదేశ సాంస్కృ తిక ఆర్థిక రంగాలలో కీలక పాత్ర పోషిస్తున్న చేనేత పరిశ్రమ ప్రాముఖ్యతను ప్రచారం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ప్రొ. వి. ఉమ పాల్గొని మాట్లాడుతూ సాంప్రదాయ చేనేత చేతి వృత్తులను సంరక్షించడం, ప్రోత్సహించడం, గ్రామీణ కళాకారులను బలోపేతం చేయడంలో వారి పాత్రను హైలైట్ చేయడం , స్థిరమైన అభివృద్ధికి దోహదపడటం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొ.ఎన్.రజని మాట్లాడుతూ భారతదేశంలో చేనేత పరిశ్రమ భారతదేశ సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక వైవిద్యానికి గణనీయంగా దోహదపడే కీలక రంగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. సుజాతమ్మ, డీన్ స్కూల్ ఆఫ్ సైన్సెస్, ప్రొ. సి. వాణి, సోషల్ సైన్సెస్ డీన్, ప్రొ. ఎం. విద్యావతి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బి. విశాలి, డా. డి.సుజాత, డా.కె.స్వాతి, డా. రుక్మిణి, డా. సునీత, డా. భార్గవి ఇతర అధ్యాపకులు, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్లు చేనేత బట్టలతో తయారు చేసిన సమకాలిన, సాంప్రదాయ దుస్తులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి మురళీధర్ మోహోల్‌కి డాక్టర్ పిసి రాయల్ ఘన సన్మానం



తిరుపతి విద్య, ఆగస్టు 7, ప్రభాతవార్త : కేంద్ర మంత్రి మురళీధర్ మోహోల్ బుధవారం ఢిల్లీలో సివిల్ ఏవియేషన్ అథారిటీ సభ్యుడు తిరుపతి ఎయిర్పోర్ట్ డెవలప్మెంట్ కమిటీ, జెడ్ ఆర్‌యుసిసి ఎస్‌సి ఆర్ ఎల్ వైఎస్, ఎంఎస్ఎంఈఎస్ రాజ్య భాష, దిశా గ్రామీణాభివృద్ధి పంచాయితీ రాజ్ ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎస్ఎల్‌సిసి ఏపీ సంబంధిత యూనియన్ మంత్రిత్వ శాఖల పిసి రాయల్ కేంద్ర మంత్రి మురళీధర్ మోహోల్‌ని శాలువా పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించే అభినందించారు. సౌర విమానయానం

## చేనేత దుస్తులను ధరిస్తే కార్మికుల కష్టాలు తీరుతాయి : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు ఒక్క రోజు తప్పనిసరిగా చేనేత దుస్తులను ధరిస్తే కార్మికుల కష్టాలు తీరుతాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని పద్మశాలి కళ్యాణ మండలంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పలువురు చేనేత కార్మికులను కలెక్టర్ వెంకటేష్‌తో కలిసి ఆయన సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ దివంగత ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక్కరోజు రాజకీయ నాయకుల అందరూ చేనేత దుస్తులను ధరించే విధంగా చేసినట్లు తెలిపారు. చేనేత పరిశ్రమను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. టిడ్కో గృహాలు పూర్తిచేసి కార్మికులకు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, చైర్ పర్సన్ లెక్క భానుప్రియ, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, పద్మశాలి కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్‌లు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.రెండు లక్షలు విరాళం



కాణిపాకం, ఆగస్టు 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కాకినాడకు చెందిన సుబ్బిరెడ్డి అనే భకు ్తడు 1,00,716 రూపాయలు, కొంగారెడ్డిపల్లెకు చెందిన బాల గురునాధం అనే భక్తుడు 1,00,116 రూపాయలను రూపాయలను విరాళంగా అందజేశారు. విరాళ మొతా ్తన్ని దాతలు చెక్ రూపంలో వేర్వేరుగా కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ వెంకటేశు, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన చల్లా సోదరి



పుంగనూరు,ఆగస్టు 7 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లాబాబు సోదరి వీణ, కాంట్రాక్టర్ మరియు తెలుగుదేశం నాయకుడు ఎం లక్ష్మణరాజులు బుధవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్బంగా ముఖ్యమంత్రికి పుంగనూరులో జరుగుతున్న పరిణామాలను,పార్టీ అభ్యున్నతికి తీసుకుంటున ్న చర్యలను, పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో చల్లాబాబు,ఇతర నాయకులు చేస్తున్న సేవలను చల్లా సోదరిమణి వీణ వివరించారు. రాబోయే కాలంలో శుభపరిణామాలే జరుగుతాయని, ఓపికతో ఎదురు చూడాలని, నియోజకవర్గంలో పార్టీను రెట్టింపు బలోపేతం చేసేందుకు సహకరించాలని లక్ష్మణరాజుకు సూచించారు.

## మామిడి కొమ్మల కత్తరింపు చేయాలి

వెదురుకుప్పం,ఆగస్టు 7 ప్రభాతవార్త : పంట తరువాత మామిడి చెట్లకు కొమ్మలు కత్తరింపు చేయించాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి మామిడి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామంలో మామిడి కోతలు అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్దతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులు నూతన పద్దతులు, అనుసరించడం వలన ఖర్చులు తగ్గించి అధిక లాభాలు పొందవచ్చాన్నారు. మామిడి కోతలు పూరైన తరువాత కొమ్మలు కత్తరించడం వలసిన ఆవశ్యకత, దాని వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అక్టోబరు 15 తరువాత నీళ్ళు పెట్టడం ఆపివేసి తిరిగి డిసెంబర్ 15 తరువాత నీళ్ళు పారించాలని చెప్పారు. అలాగే డ్రిప్ వేయడంకు ఐదు ఎకరాల లోపు రైతులకు డ్రిప్ 90 శాతం, స్పింకర్లు 55 శాతం రాయితీ, ఐదు పది ఎకరాలగల రైతులకు డ్రిప్ 70 శాతం, స్పింకర్లు 45 శాతం రాయితీతో అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన వనశాఖాధికారి వింధ్య, మండల వ్యవసాయాశాధికారిణి వనిత, రైతు బరోసా కేంద్రం అధికారులు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరం : కడ పి.డి.



కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త : తల్లిపాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం పిఇఎస్ వైద్యకళాశాల ఆడిటోరియంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంఘనంగా నిర్వహించారు. పిడి మాట్లాడుతూ పిల్లలకు తొలి ఆరు నెలలపాటు తల్లిపాలు ఎంతో ముఖ్యమని తద్వారా శిశువుల ఎదుగుదల ఉంటందన్నారు. ముందు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తమ ప్రోత్సాహం ఉంటుందన్నారు. పిఇఎస్ డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం 65శాతం పిల్లలు మాత్రమే తల్లిపాలు పొందుతున్నారన్నారు. శిశువులకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన పెంచాలని సూచించారు. మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య మాట్లాడుతూ తల్లిపాలు పుట్టిన శిశువుకు మొదటి వ్యాక్సిన్‌లా పనిచేస్తాయన్నారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా॥ రాజే ంద్రనాయుడు మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యత, శిశు ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా॥ హరిశ్చంద్ర, వైద్యులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## యాత్రికులకు అనుగుణంగా రైళ్ళు నడపండి : ఎంపి



తిరుపతిటౌన్, ఆగస్ట్ 7ప్రభాతవార్త: తిరుపతి యాత్రాస్థలం, అంతర్జాతీయంగా ఖ్యాతిచెందడంతో తిరుపతినుండి అనేక పుణ్యక్షేత్రాలకు,ప్రధాననగరాలకు రైళ్ల నడపాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కోరారు. బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన కేంద్ర రైల్వేశాఖను తిరుపతికి, తిరుపతి నుండి కొత్తరైళ్లవివరాలు తెలియజేయాలని కోరారు.

## ఆవాస్ యోజన వంద రోజుల లక్ష్యాలు సత్వరం పూర్తి

**- హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలను ఆదేశించిన కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలను ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశ భవనంలో బుధవారం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాకు కేటాయించిన ఇళ్ళ పురోగతిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ళపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. పెండింగ్‌లో వున్న ఇళ్ళ నిర్మాణాలను వంద రోజుల ప్రణాళికను నిర్దేశించుకుని 22,125 ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో లబ్దిదారులకు చర్చించి ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉపాధి పథకంలో ఉపాధి కూలీలను ఇంటి నిర్మాణ పనుల్లో వినియోగించుకోవడానికి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోయినా టెక్నికల్ అసిస్టెంట్ సహాయంలో మస్టర్ వేయించాలని కలెక్టర్ ఎంపిడిఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి పద్మనాభం, హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఎఇలు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో ఉపాధి పనులు

**- జంగాలపల్లి గ్రామంలో ఉపాధి పనులు తనిఖీ చేసిన డ్వామా పిడి రాజశేఖర్**



యాదమరి, ఆగస్టు 7 ప్రభాతవార్త: ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలను గుర్తించి వారికి పనులు కల్పించాలని డ్వామా పిడి రాజశేఖర్ ఆదేశించారు. మండలంలోని జంగాలపల్లి పంచాయతీలో బుధవారం డ్వామా పిడి రాజశేఖర్ ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా డ్వామా పిడి రాజశేఖర్ జంగాలపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న క్యాటిల్ ఫాండు, మాధవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఫిష్ పాండు పనులను తనిఖీ చేశారు. డ్వామా పిడి రాజశేఖర్ ఈ సందర్బంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి లేని ప్రతి ఒక్కరికి పనులు కల్పించాల్సి వుందన్నారు. మండల పరిధిలోని ప్రతి పంచాయతీ పరిధిలో వున్న అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పిడి ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఎపిడి సుబ్రమణ్యం, అదనపు ప్రొగ్రాం ఆఫీసర్ బాల, సాంకేతిక సహాయకులు మధు, దేవరాజు నాయుడు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## సోమలలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్‌దాడులు

**-రూ.2.81లక్షల జరిమానా**



పుంగనూరు,ఆగస్టు 7 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని సోమల మండలంలోని పలుగ్రామాలలో అత్యధికంగా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు గుర్తించిన ఏపిఎస్పీడిసిఎల్ తిరుపతి ఉన్నతాధికారులు హఠాత్తుగా బుధవారం తనిఖీలు చేపట్టారు. ఏపిఎస్పీడిసిఎల్ తిరుపతి ఇఇ పుల్లా బాలాజీ నేతృత్వంలో ఎనిమిది గ్రామాలలో ఇండ్లు,దుకాణాలలో తీవ్ర విద్యుత్ చౌర్యాన్ని కనుగొన్నారు. సోమల సబ్‌స్టేషన్ పరిధిలోని సోమల, కందూరు, కామిరెడ్డిగారిపల్లి, తమ్మినాయునిపల్లి, నెల్లిమంద, వల్లిగట్ల, ఇరికిపెంట, దిడ్డివారిపల్లిలలో పలు దుకాణాలు,ఇండ్లలో అక్రమ విద్యుత్ వాడకాన్ని ప్రత్య క్షంగా కనుగొన్నారు. నేరుగా తీగెలకే వైర్లు తగిలించి విద్యుత్ వాడుతుండడంతో మొత్తం 92 కేసులను నమోదుచేశారు. వీరికి రూ. 2.81లక్షల జరిమానా విధించారు. ఇఇ పుల్లా బాలాజీ మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్‌ను వాడడం నేరమన్నారు. కార్యక్రమంలో అధికారులు పూర్ణచంద్రకుమార్,నర్సింహమూర్తి,మాధవరావు, నరేంద్రలతో పాటూ డిప్యూటీ ఇఇలు హరినాథ్,రాజా,చలపతి,కృష్ణయ్య,శ్రీనివాసరావు,మహేంద్రరెడ్డి, ఏఇలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 24గంటల్లోనే జనన,మరణ ధృవీకరణ పత్రాలు జారీ

**- మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు**



కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇరవై నాలుగు గంటల్లోనే జనన, మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదయ్యే జనన, మరణ వివరాలు రికార్డు చేసుకుని ప్రత్యేక శ్రద్ధతో మున్సిపల్ పరిధిలో నమోదైన ఇరవై నాలుగు గంటల్లోనే ధృవీకరణ పత్రాలు అందిస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రజలు ఏదేని సమస్యలపై నేరుగా తనను కలసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## ఢిల్లీలో కేంద్రమంత్రులను కలసిన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాత వార్త : ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కలసి తిరుపతి విమానాశ్రయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరగా స్పందించిన మంత్రి వెంటనే తిరుపతి విమానాశ్రయాన్ని రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి చేసి మరిన్ని విదేశీ విమానసర్వీసులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులకు కొంతనష్టపరిహారం రాకపోవడంతో బాధిత రైతులను సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కేంద్ర గృహ నిర్మాణ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ మనోహర్‌లాల్‌కట్టర్‌ను కలసి బొజ్జలశ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను మంజూరు చేయాల్సిందిగా కోరారు.

# స్విమ్స్‌లో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న స్విమ్స్ ఉపకులపతి

తిరుపతి హెల్త్, ఆగస్టు 7 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ శ్రీ పద్మవతి హాస్పిటల్‌లో బుధవారం రోటరి క్లబ్ తిరుపతి వారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా పిడియాట్రిక్స్, గైనకాలజీ విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు పట్టించడం బిడ్డకు అమృతం లాంటిదని, తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, వ్యాధి నిరోధక శక్తిగా ఉంటుందని, అలాగే బిడ్డకు మొదటి నెల నుండి ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమన్నారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా నిమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుకోవచ్చునని తెలియజేశారు. పిడియాట్రిక్స్ విభాగాధిపతి డా. పునీత్ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు మొట్టమొదటి వ్యాక్సిన్, బిడ్డకు అమ్మపాలు వరం సురక్షితం, పౌష్టికాహారం, అన్ని పోషకాలు అందించి రోగాల నుండి రక్షించే అమృతం, పోతపాలకంటే తల్లిపాలు త్రాగే పిల్లలు బలంగా తెలివిగా వుంటారని పేర్కొన్నారు. గైనకాలజి విభాగాధిపతి డా. మాలతి మాట్లాడుతూ పాలు ఎక్కువగా వుండి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేని తల్లులకు పాల దానం పై అవగాహన కల్పించి వారి నుండి పాలను సేకరించి, సురక్షితమైన పాలుగా నిర్ధారించిన తరువాత, తల్లి పాలు ఇవ్వలేని చిన్నారులకు ఉచితంగా అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం రోటరీ క్లబ్ ప్రాజెక్టు చైర్మన్ టి. దామోధరం మాట్లాడుతూ తిరుపతి రోటరీ తల్లిపాల నిధి ద్వారా ఇప్పటి వరకు 321 మంది తల్లుల ద్వారా పాలను సేకరించి, వీటిని దాదాపు 600 మంది పిల్లలకు పట్టించడం జరిగిందని తెలియజేశారు. స్విమ్స్ ఆర్‌ఎంఒ డా. కోటిరెడ్డి, గైనకాలజి డా. మృదల, డా. సాగరిక, డా.శిల్పా, డా.ఇందుజ, డా. సన, డా.సువృతి, డా.సుమన, డా రామ్మోహన్ రెడ్డి, సీనియర్ రోటరీయన్ టి. శేషయ్య, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.